అభివృద్ధికి అందరూ సహకరించాలి

- మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి
- ప్రజలకు సేవ చేయడమే మా కర్తవ్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంటలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌డ్డి

చేగుంట, జనవరి 18: గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలు కొనసాగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. చేగుంట మండలం వడియారం గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం మండలానికి చెందిన 70 మంది, నార్సింగి మండలానికి చెందిన 20మంది మొత్తం 90 కల్యాలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం గోల్లపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మంచి పథకాలు కాంగ్రెస్ కూడా కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం నాలుగు పథకాలు అమలు చేస్తున్నదన్నారు. లబ్ధిదారులకు సంబంధిచిన ఎంపిక లో పారదర్శకంగా ఉండాలన్నారు. నియోజక వర్గానికి 3వేల5వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. భూమిని రేషన్ కార్డు, ఉపాధి హామీలో పనిచేసే ఆ కుటుంబంలో ఒక్కరికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరం: ఎమ్మెల్యే

ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్‌ను పాటించాలని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రజలకు సేవ చేయడం తమ కర్తవ్యంగా భావించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వడియారం గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మంత్రితో చెక్కుల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదిక మీది రావడంతో ఎమ్మెల్యేతో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొన్నది. మంత్రి కొండా సురేఖ జ్యోకం చేసుకొని శ్రీనివాస్‌రెడ్డిని వెనక్కి పంపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి, తహసీల్దారులు నారాయణ, కరీం, ఎంపీడీవో చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్లు మ్యాకల పరమేశ్, వంటరి కొండల్‌రెడ్డి, బాగులు పాల్గొన్నారు.

శ్రీనివాస నిధికి రూ.లక్షా 21వేల విరాళం

రామాయంపేట, జనవరి 18: రామాయంపేటకు చెందిన వ్యాపారవేత్త కిష్టపురం సురేందర్‌చారి, వెంకట తులసీరాణి దంపతులు శనివారం ఆలయ కమిటీకి రూ.లక్షా 21వేల విరాళం అందజేశారు. పుష్కర బ్రహ్మోత్సవం సందర్భంగా 1001 కళశాలతో జరిగే పూజకు సామగ్రి అందజేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

నిజాంపేట, జనవరి 18: బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిజాంపేట ప్రధాన రోడ్డుపై నస్కల్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. శనివారం గ్రామస్తులు మొహానికి నల్ల గుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యే వరకు నిరసన ఆగదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లం, దుర్గయ్య, నరేశ్‌గౌడ్, లింగం, రహీమ్, నరేశ్, శ్రీనివాస్, జావేద్, వెంకట్‌గౌడ్, బాలేశ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగనున్న సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నర్సమ్మ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో మహాసభల బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలమణి, మల్లేశం, నాగరాజు, సంతోష్, బస్వరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం

రామాయంపేట, జనవరి 18: దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతామని జిల్లా సంఘం అధ్యక్షుడు కుమ్మరి కుమార్, హక్కుల పోరాట సమితీ జిల్లా అధ్యక్షుడు పాండు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు దివ్యాంగుల జిల్లా సంఘం పూర్తి మద్దతు తెలిపారు. శనివారం రామాయంపేటకు విచ్చేసిన వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25న రామాయంపేట ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామాయంపేటకు వస్తున్నందున తాము మద్దతు తెలుపుతామన్నారు. సమావేశంలో రమేశ్, గౌరవ అధ్యక్షుడు గంగపురం స్వామి, మహేశ్, మహిళా అధ్యక్షురాలు గంగవ్వ ఉన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గాయపడిన వంజరీ బుచ్చయ్య

చిలిపిచెడ్, జనవరి 18: మండలంలోని ఫైజాబాద్‌లో కోతులు వ్యక్తిపై దాడి చేసి బీభత్సం సృష్టించాయి. శనివారం గ్రామంలో వంజరి బుచ్చయ్య ఉదయం గేదెలకు పాలు పిండుతుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కోతుల బెడద నుంచి తప్పించాలని గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.

పూసల కులాన్ని ఎంబీసీలో చేర్చాలి

కోహెడ జనవరి 18: పూసల కులాన్ని ఎంబీసీలో చేర్చాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో పూసల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుంటిపల్లి వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. పూసల సంఘం సమస్యలు పరిష్కరించాలని, జిల్లా కేంద్రంలో సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, చేను రమేశ్, తుపాకుల రవి, కోనేటి శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా పర్వీన్ ఫాతిమా

కౌడిపల్లి, జనవరి18: నూతన పశువైద్యాధికారిగా పర్వీన్ ఫాతిమా శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ రాజు బదిలీపై వెళ్లారు. ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే నివాళి

మెదక్ మున్సిపాలిటీ: బాలరాజు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట: ఖాజాపూర్‌లో ఐటీ ఉద్యోగి యాదగిరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18: తెలంగాణ ఉద్యమకారుడు, మెదక్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుండు బాలరాజు (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, తదితర నాయకులు మృతుడి ఇంటికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలరాజు మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో తమతో పాటు చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు. బాలరాజు కుటుంబాన్ని పార్టీపరంగా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వారి వెంట మున్సిపల్ కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి, ఆర్‌కే శ్రీనివాస్, జయరాజ్, నాయకులు లింగారెడ్డి, మోచి కిషన్, శంకర్, సుమన్, మధు నగేశ్, గట్టేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, జనవరి 18: బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని కొర్విపల్లి గ్రామానికి చెందిన వెటర్నరీ రిటైర్డ్ ఉద్యోగి వెంకటస్వామి మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అక్కడకు చేరుకుని వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఖాజాపూర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి యాదగిరి మృతి చెందగా, అక్కడకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మడూర్ గ్రామానికి చెందిన ఓ ఉద్యోగి రమేశ్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పార్టీ మండలశాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు మాజీ సర్పంచ్ పోచయ్య, బండారు స్వామి రమేశ్, వేణుగౌడ్, స్వామి, బస్వరాజ్, సత్యనారాయణ, ఆంజనేయులు, నాగరాజు, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

చేగుంట: వడియారం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్, పాల్గొన్న అధికారులు

- విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెంచేలా బోధన చేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాలు సాధించేలా సంబంధిత అంశాలపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఏయే అంశాల్లో వెనుకబడ్డారో తెలుసుకుని వాటిలో మెళకువలు పొందేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యాబోధన జరగాలన్నారు. పదో తరగతిలో ఉతీర్ణులైన విద్యార్థులందరినీ కళాశాలలో చేర్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసిస్తారని, పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచేలా కృషి చేయాలన్నారు. జిల్లాలోని 96 పాఠశాలలు వంద శాంత ఉతీర్ణత సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారితో పాటు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, టీఎస్ఎమ్ఎస్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా భోజనం అందించాలి

చేగుంట, జనవరి 18: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా, భోజనం అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. చేగుంట మండలం వడియారం జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవతరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పలు సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు సంబంధించిన వంటలను పరిశీలించారు.

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవాన్ని శాఖల వారీగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో యథావిధిగా జెండా ఎగరవేయాలన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే రిపబ్లిక్ డేను వైభవంగా నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులకు అందించే విషయంపై సిద్ధంగా ఉండాలన్నారు. సమగ్ర సమాచారంతో రిపబ్లిక్ డే ఇన్విటేషన్ కార్డ్స్ తయారు చేయాలని ఏవోను ఆదేశించారు. శాఖల వారీగా చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యాచరణ ముమ్మరం చేయాలన్నారు. తాగునీరు, శానిటేషన్, మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్య ప్రణాళికాధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి సమన్వయంతో ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై ప్రాధాన్యతనిస్తూ, నూతన పథకాల ఆమలును పరిగణలోకి తీసుకోవడంతో పాటు శాఖల వారి సమగ్ర సమాచారంతో ముఖ్యఅతిథిల ప్రసంగం తయారు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా 108 అంబులెన్స్ సిద్ధం చేసుకోవడంతో పాటు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ, ఆరోగ్య, ఆర్టీసీ శకటాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖ ద్వారా సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించడానికి సిద్ధం చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లు, రోడ్డు ప్రమాదాలు యువత మొబైల్ ఫోన్స్, ఇన్‌స్టాగ్రామ్ వాడకం ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని, వారిలో చైతన్యం వచ్చేలా సంబంధిత శాఖల ద్వారా స్క్రిప్ట్ నాటకం రూపంలో చూపించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందించే విషయంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, సుపరిపాలన, విధుల్లో చిత్తశుద్ధి, సంబంధిత అంశాల్లో ప్రథమ స్థానంలో ఉన్న ఉద్యోగులను ఎంపిక చేయాలన్నారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవో రమాదేవి, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనల్లో సత్తా చాటిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18: భవిష్యత్తు మొత్తం విజ్ఞానం మీదే ఆధారపడి ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిలా జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన మెదక్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సంజనశ్రీ, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించిన లింగాయిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి శివ చైతన్య, మెదక్ గీతా హైస్కూల్‌కు చెందిన యుమన్, మంబోజిపల్లి గీతా హైస్కూల్‌కు చెందిన అంజన, తూప్రాన్ గీతా హైస్కూల్‌కు చెందిన అఫీపా ఫాతిమాను డీఈవో రాధాకిషన్‌తో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్‌ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి ప్రదర్శనలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకడమిక్ అధికారి సుదర్శనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

రామాయంపేటలో నవోదయ ప్రవేశ పరీక్షకు కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18: జవహర్ నవోదయ 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష శనివారం సజావుగా జరిగింది. జిల్లాలోని 8 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,589 మంది బాలబాలికలకు 506 మంది గైర్హాజరయ్యారు. 1,083 మంది పరీక్ష రాసినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జనవరి 18: రామాయంపేటలో నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. పట్టణంలోని మంజీరా విద్యాలయంలో నిర్వహించి పరీక్షపే 353 మంది రాయాల్సి ఉండగా 110 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ఒకే సెంటర్‌లో ఏ సెక్షన్, బి సెక్షన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రామాయంపేటలో..

మెదక్ మున్సిపాలిటీ: పరీక్షా కేంద్రం వద్ద తల్లిదండ్రులతో బాలబాలికలు

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్సై బాలరాజు

రామాయంపేట, జనవరి 18: రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దుండగులు చోరీ చేసిన ఘటన శనివారం రామాయంపేటలో జరిగింది. ఎస్సై.బాలరాజు కథనం ప్రకారం.. ఆలయంలోని గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగుల గొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.20వేలను చోరీ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు.ఆలయ కమిటీ చైర్మన్ పల్లె శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోడల్ హౌస్‌కు స్థల పరిశీలన

శివ్వంపేటలో మోడల్ హౌస్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట, జనవరి 18: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా శివ్వంపేటలోని రైతు వేదిక సమీపంలో మోడల్ హౌస్‌ను నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా తెలిపారు. శనివారం మోడల్ హౌస్‌కు కేటాయించిన స్థలాన్ని హౌసింగ్ పీడీ మాణిక్యం, డీఈఈ సంజీవ్ రెడ్డి పరిశీలించారు. త్వరలోనే మోడల్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఉన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

శివ్వంపేటలో మోడల్ హౌస్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, జనవరి 18: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని డీఆర్డీవో సరస్వతి తెలిపారు. శనివారం చిన్నశంకరంపేటలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన వీవోఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలకు బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందించాలన్నారు. తీసుకున్న రుణాలతో చిరు వ్యాపారం చేస్తూ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డీపీఎం వెంకట్, ఎపీఎం లక్ష్మీనారాయణ, సీసీలు యశోద, రాజు, నాగరాజు, కిషన్ పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు పెచ్చులూడి తప్పిన ప్రమాదం

రామాయంపేట, జనవరి 18: ఇంటిపైకప్పు పెచ్చులూడడంతో నిరుపేద కుటుంబం తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన రామాయంపేటలోని గొల్పర్తి గ్రామంలో శనివారం జరిగింది. బొమ్మగారి బాబు-స్వప్న దంపతులు ఇద్దరు పిల్లలతో అదే గదిలో నిద్రిస్తున్నారు. తెల్లవారుజామున పక్కగదిలో స్లాబ్ పెచ్చులూడి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో వారు ఇంటి బయటకు పరుగులు పెట్టారు. ఇంటిని కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

పైకప్పు పెచ్చులు ఇంట్లో పడిన దృశ్యం

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి


రాజ్యాంగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత బహుజన నాయకులు

రామాయంపేట, జనవరి 18: దళిత బహుజనులు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. శనివారం రామాయంపేటలో భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహించి మాట్లాడారు. దేశంలోని కొంత మంది మనువాదులు రాజ్యాంగంలోని సమానత్వం, సోదరభావాన్ని జీర్ణించుకోలేక అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సదస్సులో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుబాషి సంజీవు, నర్సింహులు, దయాసాగర్, చంద్రం, గట్టు ప్రశాంత్, శివప్రసాద్, మంజుల, బండారి యాదగిరి, పరుశరాములు, రాజు, స్వామి, నరేష్, మరియమ్మ, కనకవ్వ, రవి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేత

క్రీడా సామగ్రిని అందజేస్తున్న నాయకులు

శివ్వంపేట, జనవరి 18: మండలంలోని పిల్లుట్ల గ్రామ యువకులు, క్రీడాకారులకు మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా సొంతంగా వాలీబాల్ కిట్లను బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పిల్లి శివకుమార్ ద్వారా శనివారం అందజేశారు. క్రీడాకారులు సంద్ర ప్రభాకర్, గుర్రాల ప్రవీణ్, గుర్రాల చింటూ, లింగోజీగూడ టీం సభ్యులు పాల్గొన్నారు

రెండిండ్లలో చోరీ.. స్కూటీ అపహరణ

కౌడిపల్లి, జనవరి 18: తాళం వేసిన రెండిండ్లలో సుమారు 3.20లక్షల విలువైన సొమ్మును దొంగలించిన ఘటన కౌడిపల్లిలో జరిగింది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నసీరొద్దీన్ ఖాన్, నాచారం లావణ్య మోహన్ ఇంట్లో కిరాయికి ఉంటున్నాడు. ఈనెల 12న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం ఇంటికొచ్చారు. ఇంటితాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచివుంది. అందులోని సామాన్లు చిందరవందరగా పడిఉన్నాయి. రూ.1,58,000 నగదు, బంగారం, వెండి నగలు చోరీ అయ్యాయి. దీంతో పాటు వీరి ఇంటి వెనుకాల ఉన్న ఆర్ఎంపీ ప్రభాకర్‌కు చెందిన హోండా యాక్టివాను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.